ప్రజాశక్తి
సోమవారం 25 డిసెంబర్ 2023 5 అనంతపురం

అనంతపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అంగన్వాడీలు

సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం

అంగన్వాడీలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం 13వ రోజు అనంతపురం జిల్లాలో తమ ఆందోళనలు కొనసాగించారు. ఆదివారం సాయంత్రం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.అనంతపురం, పుట్లూరు, నార్పల, గుత్తి తదితర ప్రాంతాల్లో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా మొర ఆలకించండి...

తమ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేస్తున్న సమ్మె ఐదవ రోజైన ఆదివారం కొనసాగింది. అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఎ జెఎసి జిల్లా చైర్మన్ కె విజయ్ అధ్యక్షతన సమ్మె కొనసాగించారు. ఈసందర్భంగా ఉద్యోగులు మోకాలిపై నిల్చొని నిరసన తెలిపారు.

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఈకార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సమ్మెకు ఫోర్టో అధ్యక్షులు కరణం హరిక్రిష్ణ ,పెద్దన్న, లక్ష్మీ నారాయణ,వెంకట నారాయణ , పిఆర్‌టియు నాయకులు పురుషోత్తం, యుటిఎఫ్ నాయకులు గంగాధర్, ఎపిటిఎఫ్ బాల పెద్దన్న, ఓబులేసు తదితరులు తమ మద్దతు తెలిపారు.

తమ్ముళ్లలోనూ అలజడి...

అసెంబ్లీ అభ్యర్థిత్వాలపై గుబులు
అవకాశం వస్తుందా.. లేదా..?
ఆందోళనలో ఆశావహులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో వైసిపి పెద్దఎత్తున మార్పులు, చేర్పులు చేపడుతోంది. సర్వేల ఆధారంగా సిట్టింగులకు పెద్దఎత్తున పక్కనపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో ఆ పార్టీలో అలజడి నెలకొంది. ఎవరి సీటు ఉంటుందో... పోతుందోనన్న గుబులు రేగుతోంది. ఇదే పరిస్థితి ఇంచుమించు టిడిపిలోనూ కనిపిస్తోంది. వైసిపి మార్పులకు అనుగుణంగా టిడిపిలోనూ మార్పులుండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉభయ జిల్లాల్లో వైసిపి సుమారు పది స్థానాల్లో మార్పులు చేపట్టే అవకాశాలున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. అదే స్థాయిలో టిడిపిలోనూ మార్పులు జరుగుతాయన్న ప్రచారం రాజకీయవర్గాల్లో నడుస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అనంతపురం జిల్లాలో ఘోరంగా దెబ్బతింది. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నడూ ఇంత ఎక్కువ స్థానాల్లో టిడిపి ఓటమిని చవిచూసిన దాఖలాల్లేవు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలుంటే 12 వాటిల్లో ఓటమి చెందింది. ఉరవకొండ, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రమే గెలుపొందింది. దీంతో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో విజయం సాధించే దిశగా అడుగులు వేయాలన్న ఆలోచన టిడిపిలో నెలకొంది. ఇందుకు అనుగుణంగానే మార్పులు చేపట్టే ఆలోచనలో ఆ పార్టీ అధిష్టానమున్నట్టు తెలుస్తోంది. గతంలో గెలుపొందిన ఉరవకొండ, హిందూపురం స్థానాల్లో ఎటువంటి మార్పులుండే అవకాశాల్లేవు. నందమూరి బాలకృష్ణ, పయ్యావుల కేశవ్ యధాతథంగా పోటీలో ఉండనున్నారు. ఇక తాడిపత్రిలో జెసి కుటుంబమే మార్పులేకుండా ఉండనుంది. ఇక రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలకు సంబంధించి పరిటాల సునీత రాప్తాడుకు ఉండగా, ధర్మవరం నియోజకవర్గ బాధ్యతలను పరిటాల శ్రీరామ్ చూస్తున్నారు. వీరికే ఉంటుందని వారు చెబుతున్నప్పటికీ సామాజిక సమీకరణల నేపథ్యంలో ధర్మవరంలో మార్పులుంటాయా లేదా అన్న మీమాంస ఆ పార్టీవర్గాల్లో ఇప్పటికీ కొనసాగుతోంది. అదే సందర్భంలో జనసేనతో కలసి టిడిపి పొత్తు ఉండటంతో ఆ స్థానాన్ని జనసేన అడుగుతున్నట్టు సమాచారం. ఇకపోతే తక్కిన చోట్ల కూడా పెద్దఎత్తునే మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రిజర్వు స్థానాల్లో ఇప్పటికీ స్పష్టత లేదు. శింగనమల, మడకశిర రెండు చోట్ల ఇంఛార్జులకు, ఇతర నేతలకు మధ్య సమన్వయం లేదు. దీంతో వారున్నా మొత్తం వ్యవహారాలు ఇతరులే చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న ఇంఛార్జులనుకొనసాగిస్తారా లేక కొత్తవారినీ తీసుకొస్తారా అన్న చర్చ కూడా నడుస్తోంది. ఇక కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మధ్య విభేదాలు తారాస్థాయిలోనే ఉన్నాయి. వీటిని అనేకమార్లు సమన్వయం చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో ఇక్కడ ఈ ఎన్నికల్లో ఇతరులను తీసుకొస్తారా అన్న చర్చ సైతం నడుస్తోంది. అనంతపురం, పెనుకొండ, పుట్టపర్తి, గుంతకల్లు తదితర నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను పాత వారినే కొనసాగిస్తారా లేక కొత్త వారిని తీసుకొస్తారా అన్న మీమాంస మాత్రం వీడటం లేదు. ఇప్పుడున్న నేతల్లోనూ మార్పులు, చేర్పులపై కొంత గుబులు నెలకొనే ఉంది. ఇప్పటికే పార్టీ నాలుగైదు రకాలుగా సర్వేలు సైతం నిర్వహిస్తోంది. వీటన్నింటినీ బేరీజు వేసుకుని అభ్యర్థులను ఖరారు చేసే ఆలోచనలోనున్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా మార్పులు, చేర్పుల అలజడి తమ్ముళ్లలోనూ నెలకొంది.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నగర రూరల్ కమిటీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తపోవనం సర్కిల్ నిర్వహించిన కార్యక్రమానికి కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిపిఎం నగర 1వ కమిటి కార్యదర్శి వి.రామిరెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, పాస్టర్ ఐజయ్య, నగర నాయకులు రాజా, జీవరత్నం తదితరులు హాజరై కేక్ కట్ చేసి పంచుకుని తిని ఆనందాన్ని పంచుకున్నారు. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ కుల మతాలకు అతీతంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వన్నూరప్ప, ఆవాజ్ నాయకులు వలి, మసూద్, బాబు, గఫూర్, సిపిఎం నాయకులు ప్రకాష్, రాజు, వెంకటేష్, ఓబులేష్, బాబావలి, ఆటో యూనియన్ రమేష్, అశోక్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కేక్ కోస్తున్న కెవిపిఎస్, సిపిఎం నాయకులు

ఇళ్ల స్థలాలు కాపాడాలని రాస్తారోకో

దళిత సంఘాల నేతలు అరెస్ట్, విడుదల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దళితులకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జా నుంచి కాపాడాలని లబ్ధిదారులు, దళిత సంఘాల నాయకులు సోమలదొడ్డి వద్ద రస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య తీవ్రతరం కావడంతో దళిత సంఘాల నేతలు, ఇళ్ల పట్టా దారులను పోలీసులు అరెస్ట్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు. అంతకు మునుపు ఎమ్మార్పిఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బిసిఆర్.దాస్ మాట్లాడుతూ కురుకుంట సర్వే నెంబర్ 41-1, 41-3, 41-3లో భూమిలో 279 మంది దళితులకు ఇళ్ల పట్టాలు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 11 సంవత్సరాల తరువాత ఆ భూమి మాదంటూ కబ్జా చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. తక్షణమే వారి నుంచి దళితుల ఇళ్ల స్థలాలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ నాయకులు సూరి, ఆది, శివ, కదిరప్ప, కొండ, సురేష్, మల్రాయుడు, తిప్పన్న, పెద్దలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

కల్తీ ఆహారంపై జాగ్రత్తలు అవసరం

కల్తీ ఆహార నియంత్రణ జిల్లా అధికారి రామచంద్ర

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల అనేక రోగాలు కొని తెచ్చుకున్నట్లు ఉంటుందని ఆహార పదార్థాలు పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని జిల్లా ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర హెచ్చరిస్తున్నారు. సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో అంతే వేగంగా కల్తీ ఆహార పదార్థాలు ఎక్కడపడితే అక్కడ విక్రయాలు జరుగుతున్నాయి. వాటిని తినటం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. హోటళ్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో, కిరాణా షాపులలో ఈ కల్తీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా తగు జాగ్రత్తలు పాటించకుంటే ఆస్మా, క్యాన్సర్ తదితర రోగాలకు గురికావాల్సి వస్తుంది. నేడు ఏ వస్తువు చూసినా కల్తీమయం అవుతోంది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినాకల్తీ అనేది సర్వసాధారణమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కల్తీ ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : ఆహార కల్తీ ని ఎలా నిర్ధారిస్తారు? తీసుకునే చర్యలు ఏమిటి?

జవాబు: కల్తీ ఆహారం నియంత్రించడానికి భారత ప్రభుత్వం 2016లో చట్టం తెచ్చింది. దీని ప్రకారం ఏడాదికి రూ.12 లక్షల వరకు టర్నోవర్ ఉన్న వ్యాపారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలి. లైసెన్స్ లేని వారికి ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు ఆరు లక్షల వరకు జరిమానా ఉంటుంది. హోటళ్లలో, కిరాణా షాపులలో కాలం చెల్లిన వస్తువులు అమ్మితే నేరం. కల్తీ ఉన్న ఆహార పదార్థాలను హైదరాబాదులోని ల్యాబ్ కు శాంపిల్ పంపడం జరుగుతుంది. అక్కడ నుంచి 20 రోజులకు కల్తీ ఆహారం పై నివేదికలు వస్తాయి. వాటి ఆధారంగా కోర్టులో చట్టపరంగా శిక్షలు వేస్తారు. రిజిస్ట్రేషన్, లైసెన్సులు అన్ని ఆన్‌లైన్ లో జరుగుతాయి.

ప్ర : ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా కొత్తగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 312 కేసులు నమోదయ్యాయి. వీటిలో సురక్షితం కానివి, మిస్ బ్రాండ్ కేసులు నమోదు కాగా వాటిని బట్టి కోర్టులు వివిధ రకాలుగా శిక్షలు వేసాయి.

ప్ర : కల్తీ అనేది ఏ ప్రాతిపదికన నిర్ధారిస్తారు ?

జ : కాలం చెల్లిన వస్తువులు విక్రయించడం చట్టరీత్యా నేరం. హోటళ్లలో వాడిన నూనెను తిరిగి రెండు మూడు రోజులుగా వాడుతుంటారు. దానివల్ల క్యాన్సర్, ఆస్మా లాంటి రోగాలు వస్తాయి. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వాడిన నూనెను వాడుతూ ఉంటారు. ప్రస్తుతానికి అవి తినేటప్పుడు రుచికరంగా ఉన్నా వాటి వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయి. కిరాణా షాపులలో గడువు ముగిసిన వస్తువులను విక్రయిస్తుంటారు. వాటిని వినియోగదారులు తీసుకోరాదు.

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి ?

జ : వస్తువులను కొనే ముందు ఎప్పుడు తయారు చేశారు. వస్తువుకు నిర్దేశించిన గడువు గమనించి కొనుగోలు చేయాలి. ఎట్టి పరిస్థితులలో గడువు పూర్తి అయిన వస్తువులను కొనరాదు. తాత్కాలికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పదార్థాలు రుచిగా ఉన్న ఎప్పటికీ ఆయిల్ ఫుడ్ ను తినడం వల్ల రోగాలను మనమే కొని తెచ్చుకున్న వారమవుతాము. తాజాగా వేడివేడి పదార్థాలనే భుజించాలి. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి.

ప్ర : కల్తీ ఆహారంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారా?

జ : పాఠశాలల్లోనూ, అవకాశం వచ్చిన ప్రతిచోట కల్తీ ఫుడ్ పైన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ఉన్నాం.కొత్త జిల్లా ఏర్పడినందున తగినంత సిబ్బంది లేరు. వాహన సౌకర్యం కూడా లేదు. దీంతో ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాల్సుంది.

జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అనంతపురం కలెక్టరేట్ : జనవిజ్ఞాన వేదిక జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు అనంతపురం నుంచి రెండు జట్లు, రూరల్ ప్రాంతం నుంచి ఒక జట్టును ఎంపిక చేసినట్లు జెవివి నగర అధ్యక్షులు రామిరెడ్డి, చెకుముకి కన్వీనర్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి పోటీల నిర్వహణ అనంతరం నగరంలోని ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్ల నుంచి ఒక్కో పాఠశాలను మాత్రమే ఎంపిక చేశామన్నారు. ఇందులో భాగంగానే రాజేంద్ర మున్సిపల్ స్కూల్ విద్యార్థులు మహమ్మద్, తాహేర్, హర్షవర్ధన్, భవ్యశ్రీ, లక్ష్మీ సెనర్జీ స్కూల్ విద్యార్థులు నయియా, సాదియా, సుస్మా, గురుగణేష్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇవికాక రూరల్ ప్రాంతం నుంచి కందుకూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు జాహ్నవి, భావన, అఖిల ఎంపికైనట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా సోనియా శీనా

ఉరవకొండ : పట్టణానికి చెందిన సోనియా శీనా (కె.శ్రీనివాసులు) కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈమేరకు డిసిసి అధ్యక్షుడు బండ్ల ప్రతాప్‌రెడ్డి నియామక పత్రాన్ని ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను జిల్లా జనరల్ సెక్రటరీగా నియామకం చేసిన పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, డిసిసి అధ్యక్షులు బండ్ల ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాతోపాటు ఉరవకొండ నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సోనియా శ్రీనివాసులు నియామకం పట్ల పలువురు పార్టీ నాయకులు, మిత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నియాకమపత్రం అందుకుంటున్న సోనియాశీనా

ప్రిన్సిపల్ సరెండర్‌ను ఉపసంహరించాలి

ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రేనాయక్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గిరిజన గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ డి.హర్జేనాయక్‌పై విధించిన సరెండర్‌ను ప్రభుత్వం ఉప సంహరించాలని ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.చక్రేనాయక్, ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.అశోక్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అనంతపురం నగరం నవోదయ కాలనీ, గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న హర్జేనాయక్‌పై కొందరు తప్పుడు, నిరాధార ఆరోపణలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. హర్జే నాయక్ ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగం సాధించి ఎంతో క్రమశిక్షణతో మెలుగుతూ బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించాడన్నారు. అయితే పాఠశాలలో ప్రిన్సిపల్, వార్డెన్, పీఈటీ మధ్య తలెత్తిన వర్గపోరుతో నీతి నిజాయితీ అధికారి హర్జేనాయక్‌కు సరెండర్ అయ్యే స్థితికి తీసుకొచ్చారన్నారు. ఉన్నతాధికారులు ఈ సంఘటనపై నిజ నిర్ధారణ కమిటీతో పునర్ విచారణ చేసి నిజాలు బయట పెట్టాలన్నారు. అప్పటి వరకు సరెండర్‌ను ఉప సంహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐబిఎస్-ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ నాయక్, పి.బాబునాయక్, జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్‌నాయక్, ధరమ్‌సింగ్‌నాయక్, శేఖర్‌నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు సుగుణబాయి, కార్యదర్శులు శివమణిబాయి, సుశీలబాయి, యువజన విభాగం అధ్యక్షులు రామాంజినేయులు నాయక్, కోశాధికారి పరమేష్ నాయక్, క్రిష్ణా నాయక్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రేనాయక్

సామగ్రి సరే.. మైదానాల మాటేమిటి..?

26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న 'ఆడుదాం.. ఆంధ్ర'
పలు చోట్ల క్రీడా మైదానాలు కరువు
సరైన మార్గదర్శకాలు అందక తలలు పట్టుకుంటున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణం నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. తొలుత ఈనెల 15వ తేదీన ప్రారంభిస్తున్నట్లు చెప్పి సాంకేతిక కారణాలవల్ల ఈనెల 26వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపింది. ఇది ఇలా ఉండగా ఈ కార్యక్రమం నిర్వహణ ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనికి చేపట్టవలసిన చర్యలపై దృష్టిసారించలేదన్న విమర్శలు వినపడుతున్నాయి. పోటీలు ఎక్కడ, ఎలా ఆడించాలనే విషయంలో క్రీడా ఉపాధ్యాయులకు ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. సచివాలయాల పరిధిలో మైదానాలు చాలా చోట్ల లేవు. ఎక్కడ ఆడించాలో తెలియని పరిస్థితి నెలకొంది. క్రీడలు ఆడించేందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఉపాధ్యాయులకు, క్రీడా సంచాలకులకు అందించలేదు. దీంతో వారు ఎలా నిర్వహించాలో తెలియక సతమతమవుతున్నారు. ప్రతి సచివాలయానికి పురుషులు, స్త్రీల విభాగం నుంచి ఐదు క్రీడలకు 258 మందిని నమోదు చేయించాలని, 16 నుంచి 60 ఏళ్ల వయసు వారు అర్హులని వార్డు, గ్రామస్థాయిలో జట్లను ఎంపిక చేసి ఆడించాలని మాత్రమే ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇక్కడ గెలిచిన వారిని మండల స్థాయికి, అక్కడ నుంచి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయికి పంపించాలన్నది ప్రభుత్వ నిర్ణయం. ఈ మేరకు సచివాలయ కార్యదర్శులకు క్రీడాకిట్లు అందించారు. అయితే వీటిలో కోకో, వాలీబాల్, ఆటల కోసం స్తంభాలు సరఫరా చేయలేదు.

పక్క సచివాలయాలకు వెళ్లక తప్పదు

అన్ని సచివాలయాల పరిధిలో క్రీడా మైదానాలు లేవు. హిందూపురం పురపాలక సంఘంలో ఉన్నా 43 సచివాలయాల పరిధిలో పూర్తిస్థాయిలో ఎక్కడ క్రీడా మైదానాలు లేవు. పురపాలక సంఘంలో ఎంజిఎం మైదానం, ముదిరెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం మాత్రమే ఉన్నాయి. ఇక రూరల్ మండలంలో తీసుకుంటే 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్నత పాఠశాలలు ఉండే ప్రాంతాల్లో మాత్రమే అరకొర సౌకర్యాలతో క్రీడా మైదానాలు ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో క్రీడా మైదానాలు లేవు. అదే విధంగానే జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్న గ్రామాల్లో మాత్రమే అరకొర సౌకర్యాలతో క్రీడా మైదానాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే ప్రయివేటు పాఠశాలలకు చెందిన మైదానాలు అక్కడక్కడ అందుబాటులో ఉన్నాయి. దీంతో ఖాళీ స్థలాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. మరోపక్క క్రీడా ఉపాధ్యాయులకు మూడు, నాలుగు సచివాలయాల పరిధిలో ఆటలు ఆడించాల్సిన బాధ్యతను అప్పగించారు. ఒక హిందూపురం నియోజకవర్గాన్ని పరిశీలిస్తే పంచాయతీ కేంద్రాలు మినహాయించి గ్రామాల్లో క్రీడా మైదానాలు లేవు. దీంతో క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలను వేరే చోట్ల ఆడించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మిగిలిన క్రీడల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి క్రీడా సామాగ్రిని అయితే కొనుగోలు చేసింది. అయితే ఎక్కడ ఆడించాలి, ఎలా ఆడించాలి అన్న మార్గదర్శకాలు మాత్రం ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో వెలువడించలేదన్న భావన అధికార వర్గాల్లో వెల్లడవుతోంది. ఇది చాలాదన్నట్లు క్రీడాకారులను నమోదు చేసే బాధ్యత వాలంటీర్లకు అప్పగించడంతో వారు బాధ్యతను మరిచి వారి పరిధిలో 16 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి ఒక్కరిని నమోదు చేశారు. దీంతో హిందూపురం పట్టణ జనాభా సుమారు 2 లక్షల వరకు ఉంటే ఇప్పటికే లక్షా అరవై వేల వరకు వివిధ క్రీడలు ఆడడానికి ప్రజలు ఉత్సాహం చూపించి నమోదు చేసినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ఆదిలోని హంసపాదు ఎదురవుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం

పుట్లూరులో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు రోడ్డుపై వచ్చి ఆందోళన చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలి, లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని సిఐటియు, అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ నేతలు హెచ్చరించారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా అంగన్‌వాడీలు, సిఐటియు నేతలు జిల్లావ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతపురంలో సప్తగిరి సర్కిల్ నుంచి టవర్‌క్లాక్ గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణమూర్తి మాట్లాడుతూ మహిళా పక్షపాత ప్రభుత్వమంటూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడానికే తప్పా చేతల్లో చేయడం లేదన్నారు. అంగన్‌వాడీ కార్మికులు విధులు బహిష్కరించి హక్కుల కోసం ఆందోళనలు, పోరాటం చేస్తుంటే నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గంగా ఉందన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా వారి వ్యతిరేకతను ప్రభుత్వం మూట కట్టుకుంటోందన్నారు. రాబోవు ఎన్నికల్లో వై నాట్ 176 కాదు వై నాట్ 17 అయ్యే పరిస్థితి వైపు జగన్ ప్రభుత్వం నడుస్తోందన్నారు. ప్రతిపక్ష నేతగా ఇచ్చిన వాగ్దానాలే అమలు చేయమంటుంటే అధికారంలో ఉన్నామనే దర్పం ప్రదర్శిస్తే గత ప్రభుత్వ పాలకులు పట్టిన గతి పడుతుందన్నారు. ఇచ్చిన మాట నిలుపుకోవాలన్నారు. తెలంగాణా కంటే అదనంగా అంగన్‌వాడీలకు వేతనాలు ఇవ్వాలన్నారు. గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి, సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మహిళలను కించపరిచే రీతిలో మాట్లాడుతున్నారని, ఇలాంటి వారికి రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికుల యూనియన్ నాయకులు ఆజాం బాషా, అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జయభారతి, జమున, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 13 రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సూరి మాట్లాడుతూ 13 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెట్టు దిగి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు జయలలిత, శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి, నాయకులు జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, నాగభూషణ్, అంగన్వాడీలు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అంగన్వాడీలు

నార్పలలో కొవ్వొత్తులతోనిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

నార్పల : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు ఆదివారం మండల కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు డొక్కా శ్రీదేవి, సెక్టార్ లీడర్లు పి.రామంజినమ్మ, కళావతి, రేణుక, సుధా, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుత్తిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కొవ్వొత్తులు చేత పట్టుకుని ర్యాలీ సాగింది. ర్యాలీకి సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ మద్దతు పలికారు. కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు పార్వతి, శారద, కళ్యాణి, గంగ, బావమ్మ, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మొకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోరుతూ ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారం 5వ రోజుకు చేరుకుంది. వీరి సమ్మెకు యుటిఎఫ్ నాయకులు గంగాదర్, ఫోర్టో రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరిక్రిష్ణ, జిల్లా నాయకులు పెద్దన్న, లక్ష్మినారాయణ, వెంకటనారాయణ, పిఆర్‌టియు నాయకులు పురుషోత్తం, ఎపిటిఎఫ్ నాయకులు బాల పెద్దన్న, ఓబులేసు, తిప్పేస్వామి, రామాంజినేయులు, జగదీష్, ఖరీముల్లా, తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎస్ఏ అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. కనీస వేతనాలు చెల్లించాలన్నారు.

బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల జేఏసి జిల్లా చైర్మన్ కె.విజయ్, నాయకులు రాము, రామాంజినేయులు, ప్రభాకర్, సునీత, అధాంబి, నజియ, రామమోహన్, కుంటెన్న, లింగరాజు, మనోహర్, వాణి, రాజేశ్వరి, లీలావతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం

బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత హోమం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను రథంపై ఆసీనులను చేసి ఆలయ ఆవరణలో ఊరేగించినట్లు ఆలయ అర్చకులు అనిల్‌స్వామి తెలిపారు. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారి ఓబన్న తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం ఏర్పాటు చేసినట్లు సర్పంచి పరమేశ్వరి తెలిపారు.

మృతుడి కుటుంబానికి తక్షణ సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు, అధికారులు

డి.హీరేహాల్ : అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన అంబాపురం వండరప్ప కుటుంబానికి మండల బీసీ సెల్ అధ్యక్షులు పులకుర్తి చంద్ర, సంక్షేమ సహాయకులు దివ్య ఆదివారం తక్షణసాయం అందజేశారు. వైఎస్ఆర్ బీమా కింద తక్షణ సాయం రూ.10వేలను అందించారు. మరో రూ.90వేలు మృతుడి భార్య ఖాతాకు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచి లక్ష్మన్న, నాగరాజు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు : మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో వెలిసిన సుబ్రమణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకారం, ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం, మహా మంగళహారతి, కుజదోష, కాలసర్పదోష, సర్పదోష నివారణకు మూలమంత్ర బీజాక్షర హోమం చేశారు.

పాఠశాల మైదానంలో కంపచెట్ల తొలగింపు

పాఠశాల మైదానాన్ని శుభ్రం చేస్తున్న జెసిబి

బెలుగుప్ప : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పెరిగిన ముళ్లకంపలను అధికారులు ఆదివారం తొలగించారు. మైదానంలో ముళ్ల కంపలు పెరిగి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విషయాన్ని ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్ గ్రామానికి చెందిన పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు ఆదివారం జెసిపితో క్రీడామైదానంలోని ముళ్ళకంపలను తొలగించారు. దీంతో ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు పంచాయతీ సెక్రటరీకి కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి కార్యకర్త మృతి

నివాళులర్పిస్తున్న దండు శ్రీనివాసులు

శింగనమల : మండలంలోని టిడిపి కార్యకర్త మృతికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, బెస్త నారాయణస్వామి, వడ్డే పవన్, మహ్మద్ గౌస్, సోము, తదితరులు పాల్గొన్నారు

మహాసభలను విజయవంతం చేయండి

పామిడి : ఈనెల 29న జిల్లాకేంద్రంలోని బిజిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఎపి రైతుసంఘం 13వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నప్పయాదవ్, సిపిఐ సీనియర్ నాయకులు రహీం పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని షాదీఖానాలో సిపిఐ మండల కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. అలాగే నష్టపోయిన పంటలకు పంటల వారీగా నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతు రుణాలు రద్దు చేయాలని, 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని, విద్యుత్ కోతలను ఎత్తివేయాలని, ఆర్‌బికె సెంటర్లను రైతులకు ఉంచాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలపై మహాసభల్లో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కావున పెద్ద ఎత్తున మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, ఈశ్వరయ్య, రామసుబ్బారెడ్డి, దేవరాజు, సుధాకర్‌రెడ్డి, నాగయ్య, సుంకయ్య, రాముడు, బాలయ్య, ముత్యాల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రైతుసంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భూ వివాదంపై ఘర్షణ..వ్యక్తి మృతి

మృతిచెందిన రామాంజినేయులు

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో ఆదివారం ఇరువర్గాల పడిన ఘర్షణలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం గ్రామంలోని భూమి తగాతా విషయంలో గాజుల ప్రభాకర్, రామాంజినేయులు మధ్య తీవ్రస్థాయిలో గొడవ చోటుచేసుకుంది. ఈ దాడిలో రామాంజినేయులు (55) మృతిచెందాడు. రామాంజినేయుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ సుధాకర్ గ్రామానికి వెళ్లి గొడవకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపితోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పామిడి

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని ఆపార్టీ అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు హిమబిందు అన్నారు. ఆదివారం మండలంలోని కోనేపల్లి, కోనేపల్లి తండా గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రజలు ఓ నిర్ణయానికి వచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముసలిరెడ్డి, దేవరపల్లి మాజీ సర్పంచి ప్రతాప్, నాయకులు తిరుపాల్, రామంజి, శీన, నల్లప్ప, మునీంద్ర, ప్రతాప్, చాగంటి గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమానాయక్, రాధా, జానకి, అరుణ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

అనంతపురం కలెక్టరేట్ : స్వేచ్ఛ, సమానత్వం సేవాసంస్థ (ఫ్రీడం అండ్ ఈ క్వాలిటీ సేవా ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో అనాథ, మానసిక వృద్ధులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని అనంతపురం రూరల్ మండలం గుడ్లూరు సమీపంలో ఉన్న బెరక వృద్ధులు, అనాథాశ్రమంలో దాదాపు 40 మందికి దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్వేచ్ఛ, సమానత్వం సేవా సంస్థ చైర్మన్ ఎస్.రామునాయక్ శుభకార్యాల సందర్భంగా అనాథలు, సహాయ నిరాకరణలో ఉన్న వృద్ధులకు తోచినంతగా సేవచేయాలనే ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎం.లలిత బాయి, డాక్టర్ మానసశ్రీ, సహాధ్యక్షులు బన్సీలాల్‌నాయక్, బెరక వృద్ధులు, అనాథాశ్రమం నిర్వాహకులు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన చర్చిలు

నార్పల : క్రైస్తవుల ఆరాధ్య దైవం ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు మండల కేంద్రంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ఇందులో భాగంగా చర్చిలను విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రెండు రోజుల నుంచి క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.

బోరుబావి తవ్వకం ప్రారంభం

ఉరవకొండ : ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీలో రూ.1.20 లక్షలతో ఏర్పాటు చేయనున్న బోర్‌వెల్ నిర్మాణానికి సర్పంచి లలిత, వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున, ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి ఎద్దడి తీర్చడానికి, ప్రజల అవరాల కోసం అనేక సిస్టం ట్యాంకులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, శివరామిరెడ్డి కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

బోరువెల్‌కు భూమిపూజ చేస్తున్న నాయకులు

Before the Hon'ble Permanent Lok Adalat for Public Utility Services, ANANTHAPURAMU, A.P.
Permanent Lok Adalat Case No.59/2023
Between :
The Ananthapuram Co-Operative Urban Bank Ltd.Rep.by Chief Executive Officer, D.No.10-446, Subhash Road, Ananthapuram Town- 515001. (A.P) **...Applicant**
And
1) Sri. B.Balaji
2) Sri. Shaik Fakruddin **...Respondents**
Notice to Respondent No.1
R.1:Sri.B.Balaji S/o B.Lakshmaiah aged 31 years, Hindu, Painter, R/o D.No:19-2-512, Rani Nagar, Ananthapuramu-515001. A.P
పై నెంబరు కేసులో 1వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం 23/01/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
బి.సత్యనారాయణ రెడ్డి, న్యాయవాది,
అనంతపురం, సెల్:9849665596

Before the Hon'ble Permanent Lok Adalat for Public Utility Services, ANANTHAPURAMU, A.P.
Permanent Lok Adalat Case No.56/2023
Between :
The Ananthapuram Co-Operative Urban Bank Ltd.Rep.by Chief Executive Officer, D.No.10-446, Subhash Road, Ananthapuram Town- 515001. (A.P) **...Applicant**
And
1) Sri. Konakondla Anjaneyulu
2) Sri. Konakondla Lakshmi Devi **...Respondents**
Notice to Respondent No.1
R.1:Sri.Konakondla Anjaneyulu S/o Konakondla Kristappa, aged 48 years, Hindu, Water Plant, Business, R/o D.No:3-159, Kalakarula Colony, Rajeev Colony Panchayat, Ananthapuramu-515004. A.P
పై నెంబరు కేసులో 1వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం 23/01/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
బి.సత్యనారాయణ రెడ్డి, న్యాయవాది,
అనంతపురం, సెల్:9849665596

Before the Hon'ble Permanent Lok Adalat for Public Utility Services, ANANTHAPURAMU, A.P.
Permanent Lok Adalat Case No.49/2023
Between :
The Ananthapuram Co-Operative Urban Bank Ltd.Rep.by Chief Executive Officer, D.No.10-446, Subhash Road, Ananthapuram Town- 515001. (A.P) **...Applicant**
And
1) Sri. Shaik Faruq
2) Sri. C.H.Anand Kumar **...Respondents**
Notice to Respondent No.1 & 2
R.1:Sri. Shaik Faruq S/o M.N.Basha, aged 33 years, Muslim, Mobile Shop Business, R/o D.No:3-258, B.C.Colony, Chennekothapalli, Ananthapuramu-515101. A.P
R.2:Sri. C.H.Anand Kumar S/o Chinna Choppali David, aged 48 years, Christian, R/o D.No:1-274-C, A.Narayanapuram, Ananthapuramu-515101. A.P
పై నెంబరు కేసులో 1 మరియు 2వ రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తం 19/01/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
బి.సత్యనారాయణ రెడ్డి, న్యాయవాది,
అనంతపురం, సెల్:9849665596

CHANGE OF NAME
I GARIMELLA SANYASA VENKTA SEETA RAM MURTHY (old name) S/o Garimella Narasimha Murthy, Residing flat No A1-114, Arjas Steel Plant Township, Tadipatri Mandal and Town, Anantapuramu Dist, A.P. I have Changed my name from GARIMELLA SANYASA VENKATA SEETA RAM MURTHY (old name) to **GARIMELLA SANYASA VENKATA SEETHA RAM MURTHY** (New name) for all purposes

'మార్క్ ఆసుపత్రి'లో అరుదైన శస్త్రచికిత్స

గుండెపై మూడు కిలోల క్యాన్సర్ కణతుల తొలగింపు

చికిత్స వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు, (ఇన్‌సెట్‌లో) కణతులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని మార్క్ ఆసుపత్రిలో 37 ఏళ్ల యువకుడి గుండెపై ఉన్న 2.8కిలోల భారీ క్యాన్సర్ కణతిని తొలగించారు. ఈమేరకు ఆదివారం స్థానిక ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి ఛైర్మన్, కార్డియాలజిస్ట్ డాక్టర్ మిల్టన్ ఆల్ఫ్రెడ్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌మహేష్ మాట్లాడుతూ రాయదుర్గం డి.హీరేహాల్ మండలం తిమ్మలాపురానికి చెందిన వన్నూరుస్వామి ఆరు నెలల నుంచి ఛాతీలో నొప్పి, ఆయాసం, రాత్రిపూట జ్వరం లక్షణాలతో మార్క్ ఆసుపత్రికి వచ్చాడు. దీంతో కార్డియాలజిస్ట్ కిరణ్‌కుమార్‌రెడ్డి సిటీస్కాన్ చేసి గుండె దగ్గర పెద్ద కణతి ఉందని, సర్జరీ ద్వారా తీసివేయాలి సూచించారు. అదే తడువుగా కార్డియోథొరాసిక్ సర్జన్ డా.రాఘవేంద్రమూర్తి రోగిని ఆరోగ్యశ్రీ పథకం కింద అడ్మిట్ చేసుకుని ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. ఛాతీలో కణతి చాలా పెద్దగా ఉండి, గుండెకి, బృహద్ధమనికి (అయోర్టా), ఎడమ ఊపిరితిత్తుకి పూర్తిగా అతుక్కుని ఉండడంతో దాదాపు 4 గంటలు శ్రమించి తొలగించినట్లు వివరించారు. కణతి ఎడమ ఛాతీని పూర్తిగా ఆక్రమించడంతో ఊపిరితిత్తి పూర్తిగా అభివృద్ధి చెందలేదు. కణతి సుమారు 3 కిలోల బరువు ఉందన్నారు. రోగి నుండి తీసివేసిన కణితిని రెండు కోట్ల మందిలో ఒకరికి వచ్చే అత్యంత అరుదైన 'మీడియాస్టినల్ ఇమ్మెచ్యూర్ టెరటోమా' అనే కాన్సర్‌గా పాథాలజీ ల్యాబ్‌లో గుర్తించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స తర్వాత రోగి పూర్తిగా కోలుకుని ఆరురోజుల్లో డిశ్చార్జ్ అయ్యాడని తెలిపారు. మార్క్ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన గుండె వైద్యం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది లక్ష్మి, రమణ, ధరణి, రోగి, బంధువులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ఉద్యమం

సామాజిక కార్యకర్త, న్యాయవాది గౌని ప్రతాపరెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త, న్యాయవాది గౌని ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమానికి సిద్ధం కావాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది గౌని ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర సామాజిక కార్యకర్తలు ఈ విషయమై కనీసం చర్చ కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో 2,81,673 ఎకరాల సాగు భూమి ఉండగా, అధికారిక లెక్కల ప్రకారం కేవలం 31,888 ఎకరాలు మాత్రమే సాగవుతోందన్నారు. మరో 50 వేల ఎకరాలు బోరుబావుల ద్వారా సాగవుతోందన్నారు. అత్యధిక శాతం రైతులు వర్షాధారంపైనే ఆధారపడి ఉన్నారన్నారు. వీరంతా పంటలు పండించుకోలేక అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతివృష్టి, అనావృష్టి ఫలితంగా ప్రతి ఏడాది వ్యవసాయమే భారంగా మారుతుండటంతో చిన్న, సన్న కారు రైతులు వ్యవసాయం మానేసి కూలి పనులకు వెళున్నారన్నారు. మరికొందరు రైతులు పట్టణాల్లో సెక్యూరిటీ గార్డులుగా మారారన్నారు. ఉంతకల్లు వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేయడం డి.హీరేహాల్, రాయదుర్గం, బొమ్మనహాల్ మండలాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యల పరిష్కార మార్గం కోసం రైతులతో కలిసి త్వరలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను పర్యటించనున్నట్లు తెలిపారు. రైతులను సంఘటితం చేసి ఉద్యమించనున్నట్లు తెలిపారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఓబులేసు

డప్పు కళాకారులను సన్మానిస్తున్న మాదిగ హక్కుల పోరాట సమితి నాయకులు

ప్రజాశక్తి అనంతపురం

రాజకీయ పార్టీల్లో మాదిగలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని మాదిగ హక్కుల పోరాట సమితి (ఎంహెచ్ పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు పసలూరి ఓబిలేసు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంహెచ్ పిఎస్ రాయలసీమ మహాసభలు నిర్వహించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాబా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భూమి లేని డప్పు కళాకారులకు ప్రభుత్వం భూమి మంజూరు చేయాలన్నారు. వీటితోపాటు వారి పిల్లలకు విద్యారంగంలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, దళిత ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డప్పు కళాకారుల పింఛన్ సాధన ఉద్యమంలో పని చేసిన నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎసిఎస్‌బి రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె.రఘు, దంపెట్ల శివ, ఎంహెపిఎస్ నాయకులు కెఎస్.రాజేష్, సన్నీ, జిసి వెంకటసులు, మదిగుబ్బ ఓబుళప్ప, వెంగళ ఆదినారాయణ, రుద్రయ్య, వెంకటసుబ్బయ్య, బుల్లెట్ ఓబిలేసు, రవి, రామలింగ, కుళ్లాయప్ప, శంకరనారాయణ, అంజి, వెంకటరాముడు, ఈశ్వరయ్య, అంజనప్ప, దాసరి ఆదినారాయణ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో క్రిస్మస్ సంబరాలు

శింగనమల : మండల పరిధిలోని గుత్తి రోడ్డులో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల జిఎం రామసుబ్బారెడ్డి, సిఇఒ ప్రతాప్‌రెడ్డి, ఎజిఎం శంకర్‌నారాయణ క్రీస్తు ఉపదేశాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బానుచ అధ్యాపక అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాస్టర్లు

ఉరవకొండ : ఏసుక్రీస్తు పుట్టిన పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జాన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా టవర్‌క్లాక్ దగ్గర దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోకానికి శాంతి, సహనం, సౌభ్రాతృత్వం అలవర్చుకుని ఐకమత్యంతో మెలిగి, వీలైనంత వరకూ తోటి వారికి సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వజ్రకరూరు మాజీ ఎంపిపి తిప్పేస్వామి, మండల నాయకులు అర్జున్, కోనాపురం ఎర్రిస్వామి, కౌకుంట్ల గుర్రం రామాంజనేయులు, పిసి ప్యాపిలి వైస్ సర్పంచి ఎర్రిస్వామి, వికలాంగుల సంఘం నాయకులు హోతూరు సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.